# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**
2. **వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలలో జడ్పీటీసీ ఉప ఎన్నికలకు పోలింగ్ కొనసాగుతోంది.**
3. **పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను తెలిపేలా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**
5. **గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధ్యాన్యతనిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.**

==========================

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్న నేపథ్యంలో స్త్రీశక్తి పథకం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పథకాన్ని అన్ని నియోజకవర్గాల్లో అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. అనంతరం రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ–సీఆర్డీఏపై సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. సాయంత్రం ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యం –పీ4, స్వర్ణాంధ్ర విజన్ పై 175 నియోజకవర్గాల నిపుణులతో నిర్వహించే కార్యశాలలో పాల్గొంటారు.

---------------------------

వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలలో జిల్లాపరిషత్ జడ్పీటీసీ ఉప ఎన్నికలకు పోలింగ్ కొనసాగుతోంది. పులివెందులలో 15 పోలింగ్ కేంద్రాల్లో, ఒంటిమిట్టలో 30 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఈరోజు సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ రెండు స్థానాలకు 22 మంది ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ఉప ఎన్నికల సందర్భంగా. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 14 వందల మంది పోలీసులతో భద్రతా ఏర్పాటు చేశామని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలియజేస్తూ..

వాయిస్ 30 సెకన్లు

---

ఎన్నికలల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేయనున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి ఈరోజు సందర్శించి మహిళా ప్రయాణికులతో మాట్లాడి బస్సుల్లో కావాల్సిన సౌకర్యాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు బస్సుల్లో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై ఆర్టీసీ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 28 సెకన్లు

---

దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను తెలిపేలా రాష్ట్ర వ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలో సూర్య మహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు జరిగిన జాతీయ పతాక ర్యాలీని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ...25 సెకన్లు

---

స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా రాష్ట్రంలోని తిరుపతి, విశాఖపట్నం, కాకినాడ నగరాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసి వాటి అభివృద్ధికి నిధులను కేటాయించిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తెలిపారు. తిరుపతిలో ఈరోజు జరిగిన ఛాయ్ పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్ఫూర్తితో సారథ్యం యాత్రను ప్రారంభించడం జరిగిందన్నారు. ఛాయ్ పే చర్చ కార్యక్రమం ద్వారా స్థానికులు నుండి క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు.

---

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధ్యాన్యతనిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి 45 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఆదివాసీలకు ఫించన్లు, తల్లికివందనం వంటివి అమలు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 26 సెకన్లు

---

అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్య సమితి తీర్మానం మేరకు 1999 నుండి ప్రతిఏటా ఆగస్టు 12వ తేదీన ప్రపంచ యువజన దినోత్సవాన్ని సభ్య దేశాలు నిర్వహిస్తున్నాయి. యువతకు ఉన్నత అవకాశాలు కల్పించి సవాళ్ళను, సమస్యలను అధిగమించే రీతిలో వారిని సన్నద్ధులను చేసేందుకు వీలుగా పలు కార్యక్రమాలు నిర్వహించడం, ఈ యువజన దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యం.

---

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి మంజుల అన్నారు. విజయవాడ మొగల్రాజపురం పి.బి సిద్దార్థ కళాశాల వద్ద ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజల భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాధితుల సంఖ్య క్రమంగా తగ్గుతోందని తెలిపారు.

---------------------------

అంతరించిపోతున్న ఏనుగులను సంరక్షించుకోవాలన్న లక్ష్యంతో ఈరోజు ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పాటిస్తున్నాం. ప్రకృతిలో గజరాజుల ప్రాధాన్యత, వాటి సంరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కలిగించడానికి ప్రతి ఏటా ఆగస్టు 12వ తేదీన ఏనుగుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం, ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో అత్యధిక సంఖ్యలో ఉన్నటువంటి ఏనుగులపై అక్రమ వేటలను నిర్మూలించడం, ఏనుగు దంతాల వ్యాపారాన్ని పూర్తిగా నిషేధించడం లాంటి అంశాలపై ప్రస్తుతం ప్రపంచ దేశాలు దృష్టి సారించాయి.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 12 పాయింట్ల లాభంతో 80 వేల 616 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 12 పాయింట్ల లాభంతో 24 వేల 597 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న ఐదు రోజులపాటు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేశారు.

=====================